మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# అమల్లోకి ఎన్నికల నియమావళి



**జోగులాంబ గద్వాల కలెక్టర్ సంతోష్**

గద్వాల ప్రతినిధి, మార్చి 17, ప్రభాతవార్త: భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసినందున జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే అమలులోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బి.యం.సంతోష్ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుం దని, ఏప్రిల్ 18 నుంచి 25వ తేది వరకు నామినేషన్ల స్వీకరణ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 26వ తేదిన నామినేషన్ల స్క్రూటీని, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుందని అన్నారు. మే13న పో లింగ్, జూన్ 4న కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. జిల్లాలో నాగర్‌కర్నూల్ (యస్సి) పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, గద్వాలలో 303, అలంపూర్‌లో 290 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాన్నారు. జిల్లాలో మొత్తం 4,94,945 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందులో 2,43,353 మంది పురుషులు 2,51,573 మంది మహిళలు, 19 మం ది ట్రాన్స్ జెండర్లు ఉన్నారని తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో 1,25,356 మంది పురుషులు, 1,30,499 మంది మహిళలలో పాటు 11 మంది ట్రాన్స్ జెండర్లు కాగా, అలంపూర్‌లో 1,17,997 మంది పురుషులు 1,21,074 మంత్రి మహిళలు, 8మంది ట్రాన్స్ జెండర్లు గలరని తెలిపారు. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు నియమావళిని తప్పకుండా అమలు చేయడం జరుగుతుందన్నారు.



# గద్వాలలో.. కలప అక్రమ దందా..

- వ్యాపారుల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారులు

గద్వాల ప్రతినిధి , మార్చి 17, ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లాలో జోరుగా అక్రమ కలప వ్యాపారం జరుగుతున్న సంబంధిత అటవీ శాఖ అధికారులు పట్టించు కోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ రెగ్యులర్ అధికారులు లేక పోవడం కింది స్థాయి అధికారులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నట్లు సమాచారం. విచ్చలవిడిగా అక్రమ కలప రవాణా అవుతున్న అటవీశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. కలప అక్రమంగా స్థానిక కట్టెల మిషన్లకు తరలింపు సమాచారం అధికారులకు ఇస్తే సమాచారం ఇచ్చిన వారిపై తప్పుడు ప్రచారం చేస్తూ అధికారులు లంచాలు తింటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కట్టెల మిషన్లలో అక్రమ కలప నిలువలు ఉన్న జిల్లా అధికారులు చర్యలు శూన్యం అని ప్రజలు అంటున్నారు. మొక్కలను పెంచడానికి ప్రభుత్వం హరితహారం పేరిట కోట్లాది రూపాయలు ఒకవైపు ఖర్చు చేస్తుండగా, మరోవైపు అధికారులు, స్మగ్లర్లు కలిసి చెట్లను నరికి వేస్తున్నారని ప్రజలు అంటున్నారు. వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటలాగా అక్రమ కలప దందాను మూడు పూలు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారం పై ప్రజలు, ప్రకృతి ప్రియులు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లను నరికివేయడం, అడవులను ధ్వంసం చేస్తుండటంతో జంతువులు ఆసరా కోల్పోతున్నాయి. జింకలు, దుప్పిలు, నెమళ్లు మేత కోసం పంట పొలాలవైపు వస్తున్నాయి. అడవులు యంత్రాలను వినియోగించి గుట్టుచప్పుడు కాకుండా చెట్లను నరికి వేస్తూ వాహనాల్లో తరలిస్తున్నారు. ప్రతిరోజు ట్రాక్టర్లు, లారీల ద్వారా కలప తరలుతోందనే విషయం తెలిసిన అధికారులు స్పందించడం లేదు. వేప, తుమ్మ, చెట్లను సైతం అక్రమార్కులు వదలడం లేదు. పంట డేటు గుట్టల ప్రాంతాలలోని చెట్లు, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన వృక్షాలు నెలకులుస్తున్నాయి. కలప వ్యాపారులు అమాయక ప్రజల నుండి తక్కువ ధరకు చెట్లను కొనుగోలు చేసి, వాటిని నరికి అధిక ధరలకు అమ్ముకొంటున్నారు. వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తూ క్వింటాళ్ల చొప్పున అమ్ముకుంటున్నారు. చెట్ల నరికివేతపై అధికారుల నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడిగా అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కలపను అధిక ధరలకు విక్రయిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## దళారులపై చర్యలు తీసుకోవాలి



మొక్కలను పెంచడానికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయిస్తూ హరితహారం కార్యక్ర మాన్ని చేపట్టింది. చెట్లు నరికే వారిపై చట్టపర మైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండు చేస్తున్నారు. చెట్లను నరికివేసిన కారణంగా భవి ష్యత్తులో మరిన్ని కరువు కాటకాలు వచ్చే ప్రమా దం ఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంటున్నా రు. ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్ల ను సంరక్షించాల్సి న అవసరాలు చాలా ఉన్నాయి. చెట్లను నరికివేయాలంటే అటవీశాఖ, రెవెన్యూ శాఖ సంబంధిత గ్రామ పంచాయితీ నుంచి తప్ప నిసరిగా అనుమతి తీసుకోవాలి. కానీ ఇది ఎక్కడా అమలు కావడం లేదు. దీంతో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను, గుట్టలను అడవులలో ఉన్నటువంటి చెట్లను నరికి వేస్తూ ఇటుక బట్టీలకు కట్టెల మిషన్లకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. వన సంపద సంరక్షణ కోసం తీసుకువచ్చిన వాల్టా చట్టం అధికారులు నిర్లక్ష్యంతో నీరు గారుతోంది. నెలవారీ మామూళ్ల కి అలవాటు పడ్డ అధికారులు కూడా చూసి చూడనట్టు వ్యవహరించడంతో కలప రవాణా జోరుగా సాగుతుంది.

# కమలం జోష్

- మోడీ సభతో కార్యకర్తల్లో నూతనోత్సాహం
- నాగర్‌కర్నూల్ విజయసంకల్ప సభ సక్సెస్
- తెలుగు ప్రసంగంతో ఆకట్టుకున్న ప్రధాని
- సోషల్ మీడియా వేదికగా భరత్‌కు ప్రశంసలు
- రెండు పార్లమెంట్ స్థానాల గెలుపే లక్ష్యంగా అడుగులు

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి17, ప్రభాతవార్తః బీజేపీ కార్యకర్_లు, నాయకుల్లో నూతనోత్సా హం నిండింది. నాగర్‌కర్నూల్‌లో మోడీ విజయసంకల్ప సభతో నయా జోష్ ఏర్పడింది. ఔర్ ఏక్ బార్ మోడీ సర్కార్, 400 సీట్లు గెలుస్తామంటూ మోడీ పునరుద్ఘాటించడంతో సభలో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. నా తెలంగాణ ప్రజలారా అంటూ ప్రధాని తెలుగులో చేసిన ప్రసంగంతో అందరినఅ ఆకట్టుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల గెలుపే లక్ష్యంగా మోడీ పర్యటన కొనసాగింది.

## భరత్‌కు యువత ప్రశంసలు..

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీ ఇప్పటిరకు కైవసం చేసుకున్న దాఖలాలు లేవు. ఈక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా భరత్ ప్రసాద్‌ను ప్రకటించడంతో పార్టీకి కొత్తరక్తం ఎక్కించినట్లు అయ్యింది. యువకుడు, విద్యావంతుడు, సౌమ్యుడు, సిట్టింగ్ ఎంపీ పోతుగంటి రాములు కుమారుడిగా మంచి పేరు తెచ్చుకున్న భరత్ గెలుపు ఖాయమే అంటూ యువత సోషల్ మీడియాలో అభినందనలు తెలుపుతున్నారు. మొన్న జరిగిన మోడీ సభలో తన తొలి ప్రసంగంతో అందరినీ ఆకట్టుకు న్నారు. గతంతో నాగర్‌ర్నూల్ జెడ్పీ చైర్మన్‌గా కావడానికి అన్ని అర్హతలు ఉన్నా అడ్డుకున్న వారికి చెంపపెట్టుగా సమాధానం చెబుతూ నేడు ప్రపంచ దేశాలే భారత్ ముందు మోకరిల్లేలా చేసిన విశ్వగురుగా పేరుపొందిన ప్రధాని నరేంద్ర మోడీ పక్కనే కూర్చుని ఉప్పెనెలా పైకి లేచావంటూ సోషల్ మీడియాలో భరత్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. యువకుడు భరత్‌ను గెలిపించాలంటూ మోడీ ప్రసంగించడంతో కార్యకర్తలు చప్పట్లు కొడుతూ తమ ఆమోదం తెలిపారు.









## పాలమూరుపై బీజేపీ ఫోకస్

ఉమ్మడి పాలమూరులోని రెండు ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతున్నది. ఇదే క్రమంలో నాగర్‌కర్నూల్‌లో బీజేపీని మరింత బలోపేతం చేసే దిశగా మోడీ బహిరంగ సభను ఏర్పాటు చేశారు. అయితే పాలమూరులోనూ మొన్నటి వరకు పెద్ద ఎత్తు పోటీ ఉన్నా జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు టికెట్ కేటాయిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకోవడంలో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ వచ్చినట్లు చెప్పవచ్చు. డీకే అరుణకు మొదటి నుంచి రాజకీయాల్లోనే కాదు ఉమ్మడి పాలమూరుపై పట్టుఉన్ననేతగా ఆమెకు పేరు న్నది. జనాల్లో నిత్యం కనిపించే తత్వం ఆమెది. ఇదే క్రమంలో బీజేపీ అధిష్టానం గెలుస్తుందని, పార్టీకి మరింత బలం చేకూరుతుందని నమ్మి టికెట్ కేటాయించినట్లు సమాచారం. ఏది ఏమైనా నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌రెండు స్థానాలు తన ఖాతాలో వేసుకునే దిశగా బీజేపీ కార్యచరణతో ముందుకు వెళ్తున్నది.

# గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్..

**- రామస్వామిగుట్ట తండాలో ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

**జడ్చర్ల, మార్చి 16, ప్రభాతవార్త:** గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ మహరా జ్ ఆదర్శాలను కొనసాగించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల మండల పరిధిలోని రామస్వామతి గుట్ట తండాలో నిర్వ హిస్తున్న దుర్గామాత సంత్‌సేవాలాల్ మహరాజ్ జాతర ఉత్స వాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథి గా హాజరై ప్రత్యేక పూ జలు చేశారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని బంజారాలకు తెలి యజేయడానికి జన్మిం చిన మహానీయుడు సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. సంత్ సేవాలాల్ బోధనలను అందరూ పాటించాలన్నారు. అనంతరం గిరిజనులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గిరిజనులతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

# విజయీభవ..

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం
- ఏప్రిల్2 వరకు కొనసాగనున్న పరీక్షలు
- కేంద్రాల వద్ద 144సెక్షన్
- తొలగిన 'నిమిషం' నిబంధన



మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి17, ప్రభాతవార్తః పదో తరగతి విద్యార్థులకు సోమవారం వార్షిక పరీక్షలు ప్రారంభంకానున్నాయి. నేటి నుంచి ఏప్రిల్ 2వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. సోమవారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈక్రమంలో జిల్లా విద్యాశాఖతోపాటు ఇతర అధికార యంత్రాంగం తగు ఏర్పాట్లు చేసింది. జిల్లా విద్యాశాఖాధికారులు సెంటర్లను తనిఖీ చేసి నెంబర్ అలాట్‌మెంట్‌పై పరిశీలించారుజ ఆదివారం సాయంత్రం నాటికి అన్ని కేంద్రాల్లో నెంబర్ అలాట్‌మెంట్‌తోపాటు విద్యార్థులకు నీళ్లు, టాయిలెట్ ఇతర కనీస వసతులు కల్పించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుంది. చుట్టు పక్కల జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే డీబార్ చేయనున్నట్లు మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 12,866మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనుండగా అందులో 155మంది విద్యార్థులు ప్రైవేట్‌గా పరీక్ష రాయనుండగా, 12,711మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అందులో 6,419 బాలురు, 6,292 బాలికలు ఉన్నట్లు డీఈవో తెలిపారు. జిల్లాలో మొత్తం 59 పరీక్షా కేంద్రంలో పరీక్ష నిర్వహించనున్నారు. వేసవి ద ృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తతోపాటు ఓఆర్‌ఎస్, మందులు అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే గతంలో నిమిషం ఆలస్యమైనా విద్యార్థులకు సెంటర్లోకి అనుమతి ఉండేది కాదు. ఈ నిబంధనతో చాలామంది విద్యార్థులు తమ భవిష్యత్తును కోల్పోయిన సంఘటనలు ఉన్న కారణంగా ప్రభుత్వం ఈ ఏడాది నుంచి 5నిమిషాల వరకు ఆలస్యమైనా పరీక్ష రాసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# బదిలీలు జరిగి 15 రోజులైనా చార్జ్ తీసుకోని పంచాయతీ కార్యదర్శులు..

- మ్యూచువల్ బదిలీల కోసం కలెక్టర్‌ను కలిసి కార్యదర్శులు
- అమలులోకి వచ్చిన లోక్‌సభ ఎన్నికల కోడ్
- మరో మూడు రోజుల పాటు
- పంచాయతీ కార్యదర్శులకు మ్యూచువల్ బదిలీలు లేనట్టే

ఇటిక్యాల, మార్చి 17 ప్రభాతవార్త : జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలోని 255 గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులను జిల్లా పరిధిలోని ఆయా మండలాలకు ఈ నెల 3 తేదీన జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ బదిలీలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే మండలంలోని 29 గ్రామ పంచాయతీల కార్యదర్శులు బదిలీ కాగా ఇటిక్యాల మండలంలోని 29 గ్రామాల పంచాయతీలకు కార్యదర్శులు బదిలీపై వచ్చిన కొత్త పంచాయతీ కార్యదర్శులు 15 రోజులు అయినా ఆదివారం వరకు కూడా చార్జ్ తీసుకోలేదు. సంబంధిత కార్యదర్శుల నుండి పంచాయతీ కార్యదర్శుల రికార్డులు కూడా అప్పజెప్పలేదు. కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులు మ్యూచువల్ బదిలీల కోసం కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారని మ్యూచువల్ బదిలీల మార్పు జరుగుతుందనే కారణంగా మండలంలోని 29 పంచాయతీలలో ఇంకా కొత్త పంచాయతీ కార్యదర్శులు చార్జ్ తీసుకోలేదని మండల ఎంపిఓ భాస్కర్ యాదవ్ తెలిపారు. జిల్లాలోని ఆయా మండలాల నుండి మహిళా పంచాయతీ కార్యదర్శులు ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాలకు బదిలీ కావడంతో పలు రకాల కారణాలతో పక్క మండలాలలో మ్యూచువల్ బదిలీలు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా ఇబ్బందులు ఉన్నవారికి బదిలీల అవకాశం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇవ్వగా లోక్‌సభ ఎన్నికల కోడ్ వస్తుందనే సమాచారంతో కలెక్టర్‌ను కలిసేందుకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లినట్లు సమాచారం. దీంతో లోక్‌సభ ఎన్నికల కోడ్ శనివారం నుండి అమలులోకి రావడంతో ఇక పం చాయతీ కార్యదర్శుల బదిలీలు నిలిచిపోయినట్లే. దీంతో మరో 3 నెలల పాటు కేటాయించిన గ్రామాలలోనే పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వ హించాల్సిందే. అయితే ఒకవైపు ఎన్నికల కోడ్ అమలు మరోవైపు వేసవి కాలం కావడంతో ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉండడంతో మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామాలలో తాగునీటి సరఫరా కూడా ఇబ్బందులు ఉండడంతో ప్రజలకు గ్రామాలలో తాగునీటి వసతులు కల్పించేందుకు తాగునీటి బోర్ల ద్వారా ట్యాంకర్ల ద్వారా పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాల్సి న అవసరం ఉంటుంది. అదేవిధంగా సర్పంచ్‌ల పదవీకాలం గత ఫిబ్రవరి 1వ తేదీ ముగియడంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారి పంచా యతీ కార్యదర్శులు ప్రజలకు కావలసిన వసతులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ గ్రామ పంచాయతీలో పంచాయతీకి సంబంధించిన బడ్జెట్ లేకపోవడంతో కొత్తగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీ పాలన భారంగా మారనుంది.



ఎర్రవల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

# ఇక బిఆర్‌ఎస్‌లో మిగిలేది ఆ నలుగురే

- పిసిసి చీఫ్ ఆదేశానుసారం చేరికలు
- ఎమ్మెల్యేల కంటే అధిక మెజార్టీతో ఎంపి అభ్యర్థులను గెలిపించాలి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17 ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బిఆర్‌ఎస్ పార్టీకి చెందిన యాదవ యువ నాయకులు ఆదివారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు ఎమ్మెల్యే యెన్న శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు ఆదేశానుసారం వివిధ పార్టీలకు చెందిన నాయకులను, కార్యకర్తలను పార్టీలో చేర్చుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ఏ కార్యకర్తకయినా సముచిత స్థానం కల్పించి, బాధ్యతలు కూడా అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాబోయే ఎంపి ఎన్నికల్లో, ఎమ్మెల్యే ఎన్నికల్లో కంటే ఎక్కువ మెజార్టీతో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ఎంపి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీని బూత్‌స్థాయి నుంబి బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, మహబూబ్‌నగర్ మున్సిపాల్టిలోని 49 కౌన్సిలర్‌లను రాబోయే ఎన్నికల్లో గెలిపించుకోవాలని, సర్పంచ్ ఎంపిటిసి ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. బిఆర్‌ఎస్ పార్టీలో కేవలం ఆ కుటుంబ సభ్యులే మిగులుతారని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలను బెదిరించి, పీడించిన బిఆర్‌ఎస్ నాయకులు ఒక్కొక్కరు ఇక జైలుపాలు కాక తప్పని పరిస్థితి ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఎన్‌పి వెంకటేష్, మారేపల్లి సురెందర్‌రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, సిజె బెనహర్, సుధాకర్‌రెడ్డి, ముకుంద్, రమేష్, ఐఎన్‌టియుసి రాములు యాదవ్ పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

# మాజీ మంత్రి డికె అరుణ సమక్షంలో బిజెపిలో చేరిన నేతలు



**కోయిల్‌కొండ, మార్చి 17 ప్రభాతవార్త :** మండలంలోని సూరారం గ్రామానికి చెంది న నాయకులు రామ్మూర్తి మరి కొంతమంది మాజీ మంత్రి డికె అరుణ సమక్షంలో ఆదివారం జిల్లా కేంద్రంలో బిజెపిలో చేరా రు. పార్టీలో చేరిన వారందరికి మాజీ మంత్రి డికె అరుణ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సా దరంగా ఆహ్వానిస్తూ స్వాగతం పలికారు. ఈసందర్భంగా నూత నంగా బిజెపిపార్టీ తీర్థం పుచ్చుకున్న రామ్మూర్తి మాట్లాడుతూ డికె అరుణను పార్ల మెంట్‌కు పంపే వరకు గ్రామీణ ప్రాంతాలలో ప్రతినిత్యం కృషిచేయడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నారాయణపేట బిజెపి జిల్లా కో కన్వీనర్ చెన్నారెడ్డి, మండల బిజెపి అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షులు గోవిందునా యక్, ఉదయ్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు:ఎస్సై

**అమరచింత, మార్చి 17,ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అమరచింత మండల ఎస్సై, నరేష్ అన్నారు. ఆదివారం అమరచింత మండల పరిధిలోని నాగల్ కడుమూర్ గ్రామ శివారులో పోలీస్ చెక్ పోస్ట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం వాహనాల ను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ఆదేశమేరకు పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగడానికి ముందు జాగ్రత్తగా పోలీస్ పహారా ఏర్పాటు చేశామని, ప్రజలు ఎలాంటి అనుమతులు లేకుండా డబ్బులు, బంగారం తీసుకువెళ్లరాదని ఆయన ప్రజలను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో మద్యం, అక్రమ డబ్బు తరలింపు లాంటి చర్యలకు పాల్పడిన వారి పై కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. అలాగే వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా వాహనంలో పెట్టుకోవాలని లేనిచో వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరగడానికి ప్రజలు, వివిధ రాజకీయ నాయకులు, యువకులు పోలీసులకు సహకరించాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

**ఆత్మకూర్, మార్చి 17,ప్రభాతవార్త:** తాలుకా కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 19వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లుగా మెడికల్ ఆఫీసర్ సురేందర్ గౌడ్ విలేకరులకు తెలిపారు 19వ తేదీన కందూర్ రామ్ రెడ్డి ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినటువంటి కంటి వైద్య శిబిరానికి 50 సంవత్సరాలు పై బడిన వారు కేవలం ఆధార్ కార్డు లేదా తెలుపు రేషన్ కార్డులను వెంట తెచ్చుకోవాలని వైద్య శిబిరం అనంతరం ఆపరేషన్లు అవసరమైన వారికి ఇక్కడి నుండి మహబూబ్‌నగర్ కు ఉచితంగా తరలించి భోజన వసతులు కల్పించి అన్ని విధాలుగా ఆపరేషన్లు ఉచితంగా చేయబడుతుందని ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని మక్తల్ నియోజకవర్గం అమరచింత నరువా చిన్నచింతకుంట మండలాలకు చెందిన ప్రజలు ఉపయోగించుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

## కొనసాగుతున్న గుండాల అంబరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు..

**వెల్దండ, మార్చి 17 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని గుండాల అంబరామలింగేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు శివరాత్రి నుంచి ప్రారంభమై నేటి వరకు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో కనిపించడంతో ప్రాంతమంతా కోలహాలంగా ఉంది. స్వామి వారిని ఎస్ఐ రవి దంపతులు, జీఎంఆర్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన వారణాసి జగన్నాథ్, శ్రీనివాస్, వెంకట్, బండేలవిజయ్‌భాస్కర్‌రెడ్డిలు కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బాలస్వామిశర్మ, కృష్ణయ్యశర్మ, శివప్రసాద్‌శర్మ, సంతోష్‌శర్మ, నరహరిశర్మ, సురేష్‌తోపాటు తదితరులు ఉన్నారు.



## నేటినుంచి పది పరీక్షలు పక్కాగా ఏర్పాట్లు..

**ఉప్పునుంతల, మార్చి17 ప్రభాతవార్త:** నేటి నుంచి ప్రారంభమవుతున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. మండల కేంద్రంలోని ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో విద్యాశాఖ అధికారులు, పోలీసులు సమావేశం నిర్వహించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉప్పునుంతల హైస్కూల్ నుంచి 56 మంది విద్యార్థులు, కంసాన్‌పల్లి హైస్కూల్ నుంచి 18 మంది, పెనిమిళ్ల ఉన్నత పాఠశాల నుంచి 21 మంది, వెల్టూరు ఉన్నత పాఠశాల నుంచి 23 మంది, స్థానిక కస్తూర్బా విద్యాలయం నుండి 48 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని చీఫ్ సూపరింటెండెంట్ మేడీపూర్ మల్లికార్జున్ తెలిపారు. ఇప్పటికే ఆయా పాఠశాలల పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారి రామారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఉదయం 9.30 గం.లకు పరీక్ష ప్రారంభమవుతుంది. గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకుంటే విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి ఉండదని వారు వివరించారు. ఇంకా ఎవరైనా హాల్ టికెట్లు అందని వారు ఉంటే ఆన్‌లైన్ అప్‌లోడ్ చేసుకోవచ్చని వారు సూచించారు. పదవ తరగతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, వైద్య, విద్యుత్ సౌకర్యం ఉండేలా అధికారులు ఏర్పాటుచేశారు. పరీక్ష సమయంలో ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటుచేసినట్లు ఎస్సై లెనిన్ పరీక్షకేంద్రం పరిధిలోని పరిసరప్రాంతాలలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయడంతో పాటు 144 సెక్షన్ విధించనున్నట్లు స్థానిక ఎస్సై లెనిన్ తెలిపారు. విద్యార్థులు సెల్‌ఫోన్లు తీసుకురాకూడని అదేవిధంగా పరీక్షలనిర్వహణఅధికారులు సెల్‌ఫోన్లను వినియోగించకూడదని ఇప్పటికే ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాలలో స్పష్టం చేశారు.

## కొత్త ఓటరు నమోదుకు 84 దరఖాస్తులు..

**పోలింగ్ బూతులను పర్యవేక్షించిన తహసిల్దార్ నరేందర్**

**ఇటిక్యాల, మార్చి17 ప్రభాతవార్త:** మండలంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 18 ఏళ్లు నిండిన కొత్తగా 84 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు తహసిల్దార్ నరేందర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు కొత్తగా ఓటుహక్కు నమోదు కోసం ఆదివారం మండలంలోని 49 పోలింగ్ బూతులలో సూపర్‌వైజర్లు, బిఎల్ఓల ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా 49పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక కార్యక్రమంలో 18ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటుహక్కు నమోదుకోసం 84దరఖాస్తులు వచ్చినట్లు మండల తహసిల్దార్ నరేందర్ తెలిపారు. ఈప్రత్యేక ఓటునమోదు కార్యక్ర మాన్ని ఉదండాపురం, షాబాద్, ఇటిక్యాలలోని పోలింగ్‌బూతులను తహసిల్దార్ నరేందర్ పర్యవేక్షిం చారు. కొత్త ఓటరు నమోదు దరఖాస్తులపై సూపర్‌వైజర్లను బిఎల్‌ఓలను తహసిల్దార్ అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి మండలంలో ఈ ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బిఎల్‌ఓలు పాల్గొన్నారు.




## బాలగాళ్ల నర్సింహులు కుటుంబానికి ఆర్థిక సహాయం..!!

**భూత్పూర్, మార్చి 17,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని నాల్గోవార్డు హరిజన వాడకు చెందిన బాలగాళ్ల నర్సింహులు ఆదివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందాడు, విషయం తెల్సుకున్న పలువురు నేతలు మృతుని ఇంటికి వెళ్లి సంతాపం తెల్పడంతో పాటు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. తమ వంతు సహాయం ఆర్థిక సహాయం అందించారు. మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ రు.5000లు, బీఆర్ఎస్ సీనియ ర్ నాయకుడు టి మురళీధర్‌గౌడ్ రు.10,000లు, బీఆర్ఎస్ యువజన నేత రు.5000లు అందిం చారు. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ముడా డైరెక్టర్ సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్తూర్ నారాయణగౌడ్ ఇతర నాయకులు గడ్డం రాములు, గడ్డం డీలర్ నర్సింహులు, గడ్డం యాదయ్య, సత్తూర్ సురేష్‌గౌడ్. సత్తూర్ తిరుపతయ్యగౌడ్, మండి ఆటో వెంకటయ్య, గడ్డం వెంకటయ్య, గడ్డం శ్రీనివాసులు, రమేష్, గడ్డం భీమస్వామి, బజార్ పరుశురాం, మునయ్య, మాల విఠల్‌దాస్ వెంకటేష్ తదితరులు ఉన్నారు.



## వంద రోజుల్లో 6 గ్యారంటీలను అమలు చేస్తున్న సీఎం రేవంత్..!!

**కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబుబాకర్ సిద్ధిఖీ..**



**భూత్పూర్, మార్చి 17,ప్రభాతవార్త :** ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ కార్యదర్శి అబుబాకర్ సిద్ధిఖీ అన్నారు. ఆదివారం భూత్పూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజునే రాజీవ్ ఆరోగ్యశ్రీను రు.10లక్షలకు పెంచారని, మహిళలకు ఉచి తంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణానికి వీలుగా ఫైల్‌పై సంతకాలు చేశారని, మరుసటి నెలలో రు.500లకే వంటగ్యాస్, 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును ఉచితంగా సరఫరా అమలు చేస్తున్నారని, ఇంటి స్థలముండి ఇళ్లు కట్టుకోలేని బీవారికి రు.5లక్షలు ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చేందుకు జీఓ జారీ చేశారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని పనులు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్నారని అన్నారు. తెలంగాణలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 17స్థానాలు కాంగ్రెస్‌వేని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాడుతాం..

**ఐదు నెలల పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలి**






జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న మండ్ల రాజు

**వనపర్తి టౌన్ మార్చి 17 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా తెలంగాణ గ్రామ పంచాయితి ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటీయు వనపర్తి జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో సిఐటీయు జిల్లా కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు హనీఫ్ అధ్యక్షతన జరిగింది , విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా సిఐటియు వనపర్తి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు .మండ్లరాజు, పుట్ట ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, మండ్ల రాజు పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ , గ్రామపంచాయితి సిబ్బందికి గత నాలుగు ఐదు నెలలబకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని , గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేసే వేతనాలు చెల్లిందాలని, కారోబార్ బిల్ కలెక్టర్లను సహాయం కార్యదర్శులు నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానం రద్దు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా ఇన్సూరెన్సు తదితర సమస్యలు పరిష్కరించాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్స్, డంపింగ్ యార్డ్సు హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అంటూవ్యాధులు, అనారోగ్యాలు, రాకుండా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. వీరిలో అత్యధికలు దళితులు బలహీన వర్గాలకు చెందిన పేద కార్మికులు చాలీచాలని వేతనాలతో అప్పులు చేసుకుని బతకాల్సిన పరిస్థితి రాష్ట్రంలో గ్రామపంచాయితీ సిబ్బందికి ఏర్పడిందని, ప్రభుత్వం పై మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఉద్యోగులకు నెలలో మొదటిరోజు వేతనాలు చెల్లిస్తుందని గొప్పలు చెప్పుకుంటుంది కానీ, గ్రామపంచాయితీ కార్మికులకు ఐదు నెలలు గడుస్తున్న వేతనాలు చెల్లించకపోవడం దారుణం అన్నారు. కనీస వేతనం 26వేల రూపాయలు అమలు చేయాలని, కాంట్రాక్టు విధానం రద్దు చేసి కార్మికులను పర్మనెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండు ప్రతి నెల 5వ తేదిలోపు వేతనాలు చెల్లించాలని, విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి నష్టపరిహారం 10 లక్షలు ప్రభుత్వమే ఇవ్వాలి దీని అమలు పోస్టు ఆఫీసు భీమా పథకం ద్వారా చెల్లించాలి. సహజ మరణానికి ఇన్సూరెన్సు ఐదు లక్షలు ఇవ్వాలి. ఎనిమిది గంటల పని, వారంతపు పండుగ, జాతీయ అర్జిత సెలవులు ఇవ్వాలి. ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. వేతనాలు చెల్లించకపోతే టిఆర్ఎస్ ప్రభుత్వానికి పట్టిన గతే. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ కూడా పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము, సిఐటియు జిల్లా నాయకులు మధు, ఎన్.రాములు, తెలంగాణ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం జిల్లా అధ్యక్షులు హనుమంతు, జిల్లా కోశాధికారి పుష్ప, జిల్లా నాయకులు సుగ్రీవుడు, శ్రీను, దాసు, ఎల్లయ్య, రాము, శివ , అంజనమ్మ, భాగ్యమా, కృష్ణమా, రామచంద్రయ్య, వివిధ గ్రామాల గ్రామపంచాయితీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద అవినీతి బీజేపీని ఓడిద్దాం...

**-సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ**

**కల్వకుర్తి, మార్చి 17 ప్రభాతవార్త:** దేశంలో మతోన్మాదాన్ని అవినీతిని పెంచి పోషిస్తున్న బీజేపీని సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.ఆంజనేయులు అధ్యక్షతన యూటీఎఫ్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ మతోన్మాదంతో దేశంలోని ప్రజల మధ్య వైశమ్యాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకునే పరిస్థితిలోకి బీజేపీ వచ్చిందన్నారు. మతాన్ని కులాన్ని అడ్డం పెట్టుకొని దేశంలో అశాంతిని నెలకొల్పి అధికారంలోకి రావాలని చూస్తున్నారని విమర్శించారు. దేశంలో సామాన్య ప్రజల కోసం మోడీ ప్రభుత్వం పనిచేయడం లేదని, అదాని, అంబానీల కోసం పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో అవినీతిని చట్టబద్దం చేసే ప్రయత్నం చేసిందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను కూడా భేఖాతరు చేసే ప్రయత్నం బీజేపీ చేస్తుందన్నారు. ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీని ఓడించడమే దేశానికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు, కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు, ఆర్.శ్రీనివాస్, ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు మల్లయ్య, బాల్‌రెడ్డి, బాలస్వామి, నరసింహ, ఈశ్వర్, శంకర్, మల్లేష్, దశరథం, అశోక్, శివవర్మ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ

## అనారోగ్య బాధితుడికి ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, మార్చి 17 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన మసిగంటి రమేష్ బ్రెయిన్ ఆపరేషన్ నిర్వహించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. రమేష్ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్‌షభ్యులు ఆదివారం రమేష్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. రమేష్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

# అమ్మాయిలను వేధింపులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవు...

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 17 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సార్వత్రిక అధ్యయన కేంద్రంలో అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ ఆదేశాల మేరకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు షీ టీం అధికారి వెంకటయ్య తెలిపారు. నెల్లికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ సందర్భంగా ఆదివారం తరగతులకు హాజరైన అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు షీ టీం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం వల్ల మరియు టెక్నాలజీ పెరిగిపోవడం వల్ల అమ్మాయిలపై దాడులు పెరిగిపోతున్నాయని, దీనిని ధైర్యంగా ఎదర్కోవాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడి యాలో అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలన్నారు. అమ్మాయిలను ఎవరైన బ్లాక్ మెయిల్ చేస్తే ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా వెంటనే షీ టీం నెంబరు 8712657676కు లేదా 100 నెంబరుకు సమాచా రమివ్వాలన్నారు. ఆడ పిల్లలకు అండగా ప్రతి రోజు 24 గంటల పాటు షీ టీం అందుబాటులో ఉంటుందని గుర్తు చేశారు. ఎటువంటి పరిస్థితుల్లోను అమ్మాయి లను వేధిస్తున్న వారిపై పోలీసు శాఖ ఉపేక్షించేది లేదని, ఆకతాయిలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.




విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## విశ్వగురు నరేంద్రమోడీని కలవడం నా అదృష్టం...

**కల్వకుర్తి, మార్చి 17 ప్రభాతవార్త:** విశ్వ గురువు భారత ప్రధాని నరేంద్రమోడీని ప్రత్యక్షంగా కలవడం నా అదృష్టమని, ఈ అవకాశాన్ని కల్పించిన మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారికి బీజేపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు నీరుకంటి రాఘవేందర్‌గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ లోకసభ ఎన్నికల్లో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభకు హాజరైన మోడీని ఆచారి సమక్షంలో నీరుకంటి రాఘవేందర్‌గౌడ్ కలువడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.



# కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో రాజకీయ కుట్ర:ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్

**బిజినేపల్లి, మార్చి 17 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో రాజకీయ కుట్రలో భాగంగా కవిత అరెస్టు జరిగిందని ఎంపిపి శ్రీని వాస్‌గౌడ్ మండిపడ్డారు. బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేయడం పట్ల ఆదివారం అంబేద్కర్ చౌరస్తాలో బిఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సుప్రీంకోర్టులో కేసు విచారణ జరుగుతున్నప్పుడే ఎమ్మెల్సీ కవితను ఎలా అరెస్టు చేస్తారని మండిపడ్డారు. ఏడాదిన్నర క్రితం రెండు సార్లు నోటీసులు ఇచ్చినా విధిగా విచారణకు హాజరై విచారణ సంస్థలకు ఎమ్మెల్సీ కవిత సహకరించారని ఎంపిపి గుర్తు చేశారు. అవసరమైన డేటా ఇచ్చినప్పుడు ఆమె నిందితురాలు కానది, సాక్ష్యానికి ఉపయోగపడుతుందని చెప్పిన ఈడీ అధికారులు ఏడాదిన్నర తర్వాత వచ్చి అరెస్టు చేయడం మోసపూరితమని ఆరోపించారు. బిజెపి, కేంద్ర ప్రభుత్వ రాజ్యాంగ సంస్థలన్నింటిని తనకు అనుకూలంగా పని చేయించుకుంటున్నదని, తన జేబుసంస్థలుగా పనిచేయించుకుంటున్నదని చెప్పడానికి ఇంతకు మించిన ఆధారం లేదన్నారు. బిజెపి ఈదేశంలో రాజకీయ ప్రత్యర్థులను లొంగ దీయడానికి, రాజకీయప్రత్యర్థులను దెబ్బతీయడానికి, ఎన్నికల్లో లబ్దిపొందేందుకు ఇటువంటివన్ని చేస్తున్నదని విమర్శించారు. బిఆర్ఎస్‌ను, కెసిఆర్‌ను లొంగదీసుకోవాలని ప్రయత్నం ఈపదేండ్లలో స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఈ దేశంలో బిజెపికి వ్యతిరేకంగా కెసిఆర్ ఒకరు నిలబడ్డారని, మిగతా ఎదురు నిలబడ్డ వారిపైన చేసినట్లే బిఆర్ఎస్‌పైన చేశారన్నారు. ఈ కేసులో ఎమ్మెల్సీ కవిత తప్పక బయటపడతారు. రాజకీయంగా వాడుకోవడానికి, బిఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టడానికి ఈడీ అధికారులు కవితను అరెస్టు చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరి వీడాలని బిఆర్ఎస్ శ్రేణులు నినాదాలు చేసి అరగంట పాటు తమ నిరసన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి, వైస్ ఎంపిపి చిన్నారెడ్డి, ఎంపిటిసిలు తిరుపతిరెడ్డి, బాలస్వామి, మహేశ్వర్‌రెడ్డి, వెలుగొండ లక్ష్మణ్, రఘుబాబు, సుదర్శన్‌రెడ్డి, చంద్రారెడ్డి, జగదీష్, రవిందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న టిఆర్ఎస్ నాయకులు

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఇటిక్యాల, మార్చి17 ప్రభాతవార్త:** మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన హుస్సేన్ మృతి చెందడంతో ఆదివారం విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు కొండేరు గ్రామానికి చెందిన శంకరమ్మ సేవాదళం ట్రస్టు ఛైర్మన్ పోతు రాజు సోమనాద్రి, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, అలంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి గ్రామానికి చెరుకొని భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఓదార్చి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా శంకరమ్మ సేవాదళం ట్రస్టు తరపున ఛైర్మన్ పోతురాజు సోమనాద్రి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయం బాధత కుటుంబానికి అందించారు. వీరి వెంట రవి, రాముడు, హనుమంతు, జాకీర్, పెద్ద సవరన్న, కొండన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.



## నేటి నుండి పది పరీక్షలు ప్రారంభం..

రేవల్లి, మార్చి 17,ప్రభాత వార్త : రేవల్లి, మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంగా సోమవారం నుండి 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిరాక్స్ సెంటర్లు మీసేవ కేంద్రాలు నడపరాదని అదేవిధంగా పరీక్ష కేంద్రాలకు సమీపంలో వాహనాలు నిలుపరాదని మండల తహసిల్దార్ లక్ష్మీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# బిజెపి పార్టీలో చేరిన ఎర్రవల్లి, సాతర్ల గ్రామాల యువకులు

**ఇటిక్యాల, మార్చి 17 ప్రభాతవార్త :** భారత ప్రధాని నరేంద్రమోడీ పాలనకు ఆకర్షితులై స్వచ్ఛందంగా ఆదివారం మండల పరిధిలోని ఎర్రవల్లి, సాతర్ల గ్రామాలకు చెందిన 50 మంది యువకులు స్వచ్ఛందంగా మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి సారథ్యంలో బిజెపి పార్టీలో చేరగా ఆదివారం ఎర్రవల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి పార్టీలో చేరగా వారికి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా భారత ప్రధాని నరేంద్రమోడీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అనేక రకాల సంక్షేమ పథకాలు అందించారని రైతులకు ఏడాదికి పీఎం సమ్మాన్‌నిధి కింద 6 వేల రూపాయలు అందిస్తున్నారని అలాగే 90 శాతం నిధులు గ్రామ పంచాయతీలకు నేరుగా అందించి గ్రామాల అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరిగే ఎంపి ఎన్నికల్లో 12 ఎంపీ స్థానాలను బిజెపి పార్టీ గెలుస్తుందని ఆ దిశగా యువత ఎన్నికల్లో పని చేయాలని సూచించారు. అనంతరం జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కెకె రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి పోలింగ్ బూత్ అధ్యక్షులు శివ, పరశురాం, నరేష్, గజేంద్ర, వెంకటేష్, యువకులు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువా వేసి స్వాగతిస్తున్న బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు

## కరెంట్ షాక్‌తో ట్రాన్స్‌ఫార్మర్స్ బాగు చేసే యువకుడు మృతి

**పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజెసిన వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి టౌన్ మార్చి 17 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణం 16 వార్డు కు చెందిన ఖలీల్ వనపర్తి పట్టణ శివారు లోని విద్యుత్ ఉపకేంద్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమత్తులు చేసే విభాగంలో గత కొంతకాలంగా పనిచేస్తున్నాడు ఈ క్రమంలో ఆదివారం సెలవు దినం కావడంతో లైన్మెన్ అనిల్ వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో ఒక రైతు ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని బాగు చేయడానికి ఖలీల్ ను తీసుకువెళ్లాడు ట్రాన్స్‌ఫార్మర్స్ బాగు చేయడానికి వెళ్లిన ఖలీల్ కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మృతదేహం జిల్లా ఆస్పత్రికి చేరుకున్నదని తెలుసుకొని వెంటనే జిల్లా ఆస్పత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రమాదానికి జరిగిన కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఖలీల్ కుటుంబానికి విద్యుత్ శాఖ తరపున అందజేయాల్సిన సహాయ సహకరాలు పూర్తిస్థాయిలో అందించాలని అధికారులకు సూచించారు. మృతుడి కుటుంబానికి తను ఎల్లవేళల అండగా ఉంటారని ఎమ్మెల్యే భరోసా కల్పించారు ఈ పరామర్శలో వనపర్తి పట్టణ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బొటానికల్ గార్డెన్ సూపర్..

**ప్రభుత్వ కళాశాలలో ఇంత పెద్ద ల్యాబ్ ఒక అద్భుతం: సిఐ ఆదిరెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17 ప్రభాతవార్త :** జడ్చర్లలోని డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పిజి కళాశాలలో ఉన్న తెలంగాణ బొటానికల్ గార్డెన్ 4వ ఆవిర్భావ దినోత్సవ సంబరాల్లో భాగంగా చివరి రోజు జడ్చర్ల సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఆదిరెడ్డి సందర్శించారు. సంబరాల్లో భాగంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 వాలంటీర్లు గార్డెన్ ప్రధాన ద్వారాన్ని కొబ్బరిబొండాలు, గార్డెన్ అడవుల్లో సేకరించిన వివిధ రకాల ఎండిన ఫలాలు, వాటి కవచాలను ఉపయోగించి అద్భుతంగా అందంగా అలంకరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్చర్ల సిఐ ఆదిరెడ్డిని మొక్కలతో తయారు చేసిన బొకేతో స్వాగతం పలికారు. గార్డెన్‌లోని వివిధ విభాగాలను సదాశివయ్యకు వివరించారు. అనంతరం గార్డెన్‌లో మొక్కనాటి నీళ్లు పోశారు. ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇలాంటి అద్భుతమైన గార్డెన్ ఉండటం ఒక గొప్ప విషయమన్నారు. ల్యాబ్‌లో నిల్వ చేసిన అతిపెద్ద జెర్రిపోతు పాము కుబుసం చూసి అభినందించారు. కార్యక్రమంలో గార్డెన్ కో ఆర్డినేటర్ సదాశివయ్య, పరిశోధక విద్యార్థి రమాదేవి, వాలంటీర్లు రాహుల్, వీరాంజనేయులు, శ్రీను, అంకిత, అలేఖ్య, మనీషా తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీళ్లు పోస్తున్న సిఐ ఆదిరెడ్డి, సదాశివయ్య

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పాలన..

**ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి**



**చిన్నచింతకుంట,మార్చి17 ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పాలనని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పర్దీపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, వార్డు సభ్యులు శేఖర్, తెలుగు రమేష్, తెలుగు శంకర్, మాసన్న, బొంబాయి సంజీవ, మేస్త్రీల సంఘం అధ్యక్షులు రతనయ్య, ఉపాధ్యక్షులు వెంకన్న, బిజెపి పార్టీకి చెందిన బూత్ అధ్యక్షులు బాల్‌రెడ్డితో పాటు 60 మంది బిఆర్ఎస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు, గోప్యనాయక్, తాండకు చెందిన భాస్కర్‌నాయక్, కిషన్‌నాయక్, జయరామ్‌నాయక్, వెంకటేష్‌నాయక్, గోపాల్‌నాయక్ తదితరులు దమగ్నాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అన్ని వర్గాల సంక్షేమానికై ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ ఎంపిటిసి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకటేష్ ముదిరాజ్, బుర్రినప్ప, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా శివసేనరెడ్డి

**రాష్ట్ర ఛైర్మన్ పదవి దక్కడం పట్ల హర్షం వ్యక్తం: కాంగ్రెస్ పార్టీ నాయకులు విక్రంరెడ్డి**



**రాజాపూర్,మార్చి 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని 37 కార్పోరేషన్లకు కాంగ్రెస్ ప్రభుత్వం చైర్మన్లను నియమించిందని ఇందులో భాగంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్న శివసేనారెడ్డికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ పదవి దక్కడం పట్ల కాంగ్రెస్‌పార్టీ నాయకులు పట్లోళ్ల విక్రంరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి గతేడాది నవంబర్ 30న పోలింగ్ జరగగా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నేతలకు కార్పోరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు పార్టీ ఇచ్చిందని ఆయన తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ఈ పదవుల భర్తీ దోహదపడుతుందని పార్టీ భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీలో మంచి నాయకునిగా పేరు తెచ్చుకున్న శివసేనారెడ్డిని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటి చైర్మన్‌గా నియమించడం పట్ల ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా విక్రంరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం..



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17, ప్రభాతవార్త:** రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన రాష్ట్ర కాంగ్రెస్ ఆదివాసీ విభాగం అధ్యక్షుడు బెల్లయ్యనాయక్‌ను ఆదివారం సన్మానించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వివిధ జిల్లాల ఎస్టీసెల్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంనాయక్, గద్వాల జిల్లా అధ్యక్షుడు శివనాయక్, మహబూబ్‌నగర్‌య పట్టణాధ్యక్షుడు రవినాయక్, జిల్లా కోకన్వీనర్ రాచందర్‌నాయక్, కొల్లూరు ఎంపీటీసీ తులసీరాంనాయ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## పాపగల్ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఎన్నిక



**తాడూరు, మార్చి 16, ప్రభాతవార్త:** తాడూరు మండలంలో ని పాపగల్ గ్రామంలో అభయాంజనేయ స్వామి దేవస్థాన నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నెలవెట్ల భీంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ఉపాధ్యక్షుడిగా సందడి మోహన్‌రెడ్డి, కార్యదర్శిగా సందడి రామేశ్వర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కావలి వెంకట్రాములు, కోశాధికారిగా దోమ రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా నవీన్‌రెడ్డి, వెంకట్, అఖిల్‌రెడ్డి, శ్రీకాంత్,సురేశ్,ప్రసాద్,మల్లేష్,రమేశ్, రాఘవేందర్, కుర్మయ్య, రవీందర్,కంది రాజును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు.

## కష్టపడ్డ వారికి ఫలితం లభిస్తుంది..

**స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా శివసేనరెడ్డి**

**హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గోనెల రమేష్**



**రాజాపూర్,మార్చి 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలో పని చేసిన వారికి ఫలితం దక్కుతుందని కాంగ్రెస్ ప్రభుత్వం కార్పోరేషన్ ఛైర్మన్లను నియమించిందని ఇందులో భాగంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగుతున్న శివసేనారెడ్డికి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటి ఛైర్మన్ పదవి దక్కడం పట్ల కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ గ్రామ అధ్యక్షుడు గోనెల రమేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి గతేడాది నవంబర్ 30న పోలింగ్ జరగగా కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నేతలకు కార్పోరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు పార్టీ ఇచ్చిందని ఆయన తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మరింత ఉత్సాహంగా పని చేసేందుకు ఈ పదవులు భర్తీ దోహదపడుతుందని పార్టీ భావిస్తున్నట్లు గోనెల రమేష్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీలో మంచి నాయకునిగా పేరు తెచ్చుకున్న శివసేనారెడ్డిని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్‌గా నియమించడం పట్ల ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జితేందర్‌రెడ్డికి మిగిలింది ఎంఐఎం ఒక్కటే..

**- ఎక్కడున్నా మోడీ మంచితనాన్ని మర్చిపోలేరు..**

**- బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగూరావు నామాజీ**



సమావేశంలో మాట్లాడుతున్న నాగూరావు నామాజీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17, ప్రభాతవార్త:** మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి ఎన్టీఆర్ లక్ష్మీపార్వతి పార్టీ తెలుగుదేశం పార్టీ,టీఆర్ఎస్, బీజేపీ , కాంగ్రెస్ అన్ని పార్టీలు మారారని ఇంక మిగిలింది ఎంఐఎం ఒక్క పార్టేనని బీజేపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు నాగూరావు నామాజీ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ పార్టీలో ఉన్నా నరేంద్ర మోడీ మంచితనాన్ని జితేందర్‌రెడ్డి మర్చిపోలేరని చెప్పారు. ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి కాంగ్రెస్ నాయకుల మధ్య ఉండి మాట్లాడుతున్న మాటలు చూస్తుంటే మోడీ, బీజేపీపై ఆయనుకున్న అభిమానం బయటపడిందన్నారు. బీజేపీ ఒక సముద్రంలాంటిదని, నోరు బయటికి పోతా ఉంటని వచ్చే నీరును చేర్చుకుంటదన్నారు. పార్టీని నమ్మి వచ్చేవారిని పార్టీలో చేర్చుకుంటుందని, స్థిరత్వం లేని చెంచల మనస్సు, గుణమున్న వ్యక్తులు పార్టీని విడిచి వెళ్తుంటే వద్దనేది లేదన్నారు. అది వారికి, వారి భవిష్యత్తుకు నష్టం చేకూరుతుందన్నారు. పార్టీకి మాత్రం ఎలాంటి నష్టం జరగదని తేల్చి చెప్పారు. రాజకీయాల్లో ఓపిక అనేది ముఖ్యమని పదవులు రాలేదని పార్టీలు మారడం, పార్టీని తిట్టడం వల్ల వాళ్ల క్యారక్టర్‌పైనే ప్రభావం పడుతుందని, పార్టీ గౌరవానికి ఏమాత్రం ప్రభావ ఉండదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్‌రెడ్డి, ప్రేమేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కృషి..



సమావేశంలో మాట్లాడుతున్న జి. చిన్నారెడ్డి

**నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు కృషి**

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి**

**ఘనంగా పాలమూరు రెడ్డి సేవా సమితి వార్షికోత్సవం**

**అలరించిన చిన్నారుల ఆటపాటలు**

**హాజరైన వివిధ రాజకీయ ప్రముఖులు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలిసి తీసేందుకు నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా చాలామంది పేద రెడ్లు ఉన్నారని వారి పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాలమూరు రెడ్డిసేవా సమితి సరైన వసతి సౌకర్యం కల్పించేందుకు ముందుకు వస్తే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసి నాలెడ్జ్ సెంటర్‌ను కేటాయించేలా ఉత్తర్వులు తీసుకొస్తానని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. పాలమూరు రెడ్డి సేవాసమితి 22వ వార్షికోత్సవ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నారెడ్డి మాట్లాడుతూ సమాజంలో డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తులను పెంచగలిగితే తప్ప ఆర్థిక ప్రయోజనం ఉండదని ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులైన పాలు ఆర్గానిక్ ఆహార పదార్థాలకు ఉన్న గిరాకీని దృష్టిలో ఉంచుకొని తమ పిల్లలను వ్యవసాయంపై ఆసక్తి పెంచుకునేలా చేయటం లక్ష్యంగా పెట్టుకుని రెడ్డి సోదరులు ముందుకు వెళ్లాలని సూచించారు. రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటుతో పాటు సామాజికంగా, ఆర్థికంగా రెడ్డి కుటుంబాలను బలోపేం చేసేందుకు ఇటువంటి సంఘాలు సరైన సూచనలు, సలహాలు ఇవ్వాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. పాలమూరు రెడ్డి సేవా సమితికి అవసరమైన సందర్భంలో మౌలిక సదుపాయాల ఏర్పాటులో తాను ఎప్పుడు ముందు వరుసలో ఉన్నానని మాజీ ఎంపి ఎపి జితెందర్‌రెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తనకు ఢిల్లీలో ఒక స్థానాన్ని ఇచ్చిందని రాష్ట్రంలో కూడా క్రీడల అభివృద్ధికి ప్రత్యేక సలహాదారుడిగా నియమించిందని, ఇప్పటిలాగే క్రీడాకారులకు తాను నిరంతరం ప్రోత్సాహం అందించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులను తీర్చిదిద్దటంలో కూడా కీలక భూమిక పోషిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల పక్షాన పోటీ చేస్తున్న అభ్యర్థులు డికె అరుణ, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, చల్లావంశీచంద్‌రెడ్డిలు సమావేశానికి హాజరై తమ పార్టీలు ప్రజాహితం కోసం చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. సమావేశానికి హాజరైన వారంతా దూరదృష్టితో ఆలోచించి పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు వేయాల్సిన అవసరం ఉందని వారు సూచించారు. కార్యక్రమానికి రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి అధ్యక్షత వహించగా మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, రెడ్డి హాస్టల్ హైదరాబాద్ అధ్యక్షులు వెంకటరంగారెడ్డి,సేవా సమితి నాయకులు కె.బసిరెడ్డి, వి.మనోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూర్ రాజేందర్‌రెడ్డి, కోశాధికారి మల్లు నరసింహారెడ్డి, నాయకులు ధనుంజయరెడ్డి, రాఘవరెడ్డి, వెంకట్రాంరెడ్డి, సురెందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, విజయసారథరెడ్డి, దొడ్ల నారాయణరెడ్డి, పట్లోళ్ళ లక్ష్మారెడ్డి,టి. నారాయణరెడ్డి, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతమ్మ, స్వరూప, శోభ, వరలక్ష్మి, నర్మద, శశికళ, హేమలత, వనజ, సునిత, శ్రీలత, అనిత, సుమతి, మీనాక్షి, గీత, ఇందిర, వనజ, ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రాంతాల రెడ్డి సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చిన్నారులు శివానిరెడ్డి, సాయి సప్తశీల నాట్యము అందరిని అలరించాయి.





**రెడ్డి సేవా సమితి సేవలు చిరస్మరణీయం**

**– మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్లమెంటరీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి**

సమాజంలో మార్పు, అభివృద్ధి మూల సూత్రంగా పెట్టుకొని వెనకబడ్డ రెడ్డి సామాజిక వర్గాల బిడ్డల కోసం పాలమూరు రెడ్డి సేవాసమితి చేస్తున్న కృషి చిరస్మరణీయమని మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్లమెంటరీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పాలమూరు రెడ్డి సేవా సమితి వార్షికోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొందరు ఆర్థిక పరిస్థితి దృష్ట్యా నేటికి విద్యకు దూరమవుతున్న నేపథ్యంలో రెడ్డి సేవా సమితి నుంచి హాస్టల్ వసతులు కల్పించి విద్యనందించడం గొప్ప విషయమన్నారు. పేరుకే అగ్రకులాలు తప్పా నేటికి చాలా మంది పేదలుగా మిగిలిపోయారని ప్రభుత్వాలు బాధ్య తగా గుర్తించి వారికి ఆర్థికంగా భరోసాని వ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ ప్రజాపాలన అందిస్తున్నదని ప్రతి ఒక్క సామాజిక వర్గానికి అండగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



**అన్ని వర్గాల క్షేమం కోరే వర్గం రెడ్డి..**

**– బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ**

రెడ్డీలు అంటే ఉన్నత వర్గాలన్న భావన ఉందని, కానీ అనాదిగా అన్ని వర్గాల క్షేమం కోరే వర్గమే రెడ్డి సామాజిక వర్గమని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. అన్ని కులాలను ఆదరించేది రెడ్డి కులమే అన్నారు. అగ్రవర్గాల పేదల కోసం బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నాం అని చెబుతున్నారు..కానీ అవి నామమాత్రంగా మిగిలిపోతున్నాయని వాటివల్ల రెడ్డిలకు ఉపయోగపడింది ఏమిలేదన్నారు. పాలమూరు రెడ్డి సేవాసమితికి ఎల్లవేళలా తన సహాయసహకారాలు అందిస్తామన్నారు.



హాజరైన రెడ్డి సేవా సమితి సభ్యులు

## ఘనంగా దయానంద సరస్వతి శతజయంతి వేడుకలు..





ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్య సమాజం సభ్యులు, చిన్నారులు

**జడ్చర్ల, మార్చి 17 ప్రభాతవార్త :** మహర్షి దయానంద సరస్వ తి 200వ శతజయంతి సందర్భంగా జడ్చర్ల ఆర్య సమాజంలో వివిధ జిల్లాల ఆర్య సమాజముల అధ్యక్షులు,కమిటి సభ్యులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆర్యసమాజాల సభ్యులు, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, వివిధ హిందూ సమా జాల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని శోభాయాత్ర అంగరం గ వైభవంగా నిర్వహించారు. జడ్చర్ల పురవీధుల గుండా ఆర్య సమాజ మందిరానికి చేరుకుని యజుర్వేద గాయత్రి యజ్ఞం నిర్వహించి వేదోపన్యాసాలు, భజనలు ఘనంగా చేపట్టారు. ముఖ్య అతిథులుగా విఠల్‌రావు ఆర్య ప్రతినిధి సభ అధ్యక్షులు హైదరాబాద్ సభ అధ్యక్షులు బాద్మి శివకుమార్ ఆర్య ప్రతినిధి సభాధ్యక్షులు, జడ్చర్ల ఆర్య సమాజం అధ్యక్షులు గుబ్బ నరసిం హులు, మంత్రి బక్క రాజేశ్వర్, కోశాధ్యక్షులు బోడ్ల విజయకు మార్, ఆర్యసమాజ గౌరవ అధ్యక్షులు బాద్మి స్రవంతి, మిర్యా ల వేణుగోపాల్, అధ్యక్షులు బాద్మి స్రవంతి, మిర్యాల వేణుగో పాల్, ఉపాధ్యక్షులు డా. విజయలక్ష్మి, గుబ్బ అశోక్ ఆర్య, బాద్మి నందిని, సుకతాదేవి, ద్యాసమొనీ కృష్ణయ్య, మాజీ ప్రధానోపాధ్యాయులు, ఉపమంత్రి నాంపల్లి యాదయ్య, బీచని లవకుమార్, నవీన్, ఉపమంత్రులు ఎందరో మహానుభావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే యజ్ఞం వలన లాభాలను వాతావరణ కాలుష్య నియంత్రణకు ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు.

## నేడు 10 పరీక్షలకు సర్వం సిద్ధం..

**481 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు**

**చిన్నచింతకుంట,మార్చి 17 ప్రభాతవార్త :** నేటినుంచి జరగబోయే పది పరీక్షలకు సర్వసిద్ధం చేసినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో చిన్నచింతకుంట, వడ్డెమాన్ జడ్పీ ఉన్నత పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. వడ్డెమాన్ పరీక్ష కేంద్రంలో లాల్‌కోట, వడ్డెమాన్, బండర్‌పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 200ల మంది విద్యార్థులు, చిన్నచింతకుంట పరీక్ష కేంద్రంలో చిన్నచింతకుంట, ఉంద్యాల, జడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు కెజిబివి,మహాత్మా జ్యోతిరావుపూలె గురుకుల పాఠశాల, గౌతం మోడల్‌స్కూల్, విక్టరీ స్కూల్‌కు చెందిన 281 మంది విద్యార్థులు కలిపి మొత్తంగా రెండు పరీక్ష కేంద్రాల్లో 481మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు. వడ్డెమాన్ పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ ఫయాజుద్దిన్, సిసి కుంట పరీక్ష కేంద్రానికి గంగయ్యలు పర్యవేక్షిస్తారని ఆయన తెలిపారు. నేటినుంచి 30వతేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. పరీక్ష సమయం ఉదయం 9.30 గం.ల నుండి 12.30 గం.ల వరకు ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలోని వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తహసిల్దార్ కృష్ణయ్య తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాల పరిధిలోని జిరాక్స్ సెంటర్లు పరీక్ష సమయం వరకు మూసి ఉంచాలన్నారు. అలా కాకుండా ఎవరైనా జిరాక్స్ సెంటర్లు తెరిచినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని తహసిల్దార్ హెచ్చరించారు.

**పగడ్బందీగా పదవ తరగతి**

## పరీక్షలు హాజరుకానున్న 6366 మంది విద్యార్థులు ..

**జిల్లా వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు....జిల్లా పరీక్షల అధికారి గణేష్**



**వనపర్తి టౌన్,మార్చి 17,ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో 10వ తరగతి పరీక్షకు 6966 మంది విద్యార్థులు హాజరు కానున్నారు అందుకోసం 35 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా పరీక్షల అధికారి గణేష్ తెలిపారు. రేపు సోమవారం ఉదయం నుంచి పరీక్షలు మొదలుకానున్నాయని చెప్పారు.వనపర్తిలో 8,కొత్తకోటలో 5, పెబ్బేర్‌లో 4,ఆత్మకూరులో 3,శ్రీరంగాపూర్,రేవల్లి, మదనాపూర్,చిన్నంబాయి, వీపనగండ్ల లలో ఒక్కొక్క చొప్పున,జిల్లాలోని తక్కిన మండలాలలో ఒక్కో మండలంలో రెండేసి కేంద్రాల చొప్పున ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.ఉదయం 8.30 నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని,9 గంటలకు ఓఎంఆర్ షీట్లు ఇస్తారన్నారు.గ్రేస్ పీరియడ్ ఐదు నిమిషాలతో కలిపి 9.35 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష రాసేందుకు లోనికి పరీక్ష రాసేందుకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని చెప్పారు.ఆ తర్వాత ఎట్టి పరిస్థితిలో పరీక్ష హాల్లోకి అనుమతించబోరని విద్యార్థులు తల్లిదండ్రులు గమనించాలన్నారు.ఇన్ టైంలో కేంద్రాలకు చేరుకోవాలన్నారు.పరీక్ష కేంద్రాలలో లైట్లు,మరుగుదొడ్లు,ఫ్యాన్లు తదితర అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు.

## ముదిరాజ్ కార్పోరేషన్ ఏర్పాటు..

**స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**

**మక్తల్,మార్చి 17 ప్రభాతవార్త :** ముదిరాజ్ కార్పోరేషన్ ఏర్పా టు కోసం సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ కేబినె ట్ ఆమోదం తెలపడం హర్షణీయమని మక్తల్ ముదిరాజ్ సం ఘ యూత్ నాయకులు మామిళ్ల పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కార్పోరేషన్ ఏర్పాటు కోసం రాష్ట్రం లోని ఏకైక ముదిరాజ్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ ఎనలేని కృషి చేశారని అన్నారు. ముదిరాజ్ కార్పోరేషన్ ఏర్పా టుకు సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ లకు ధన్యవాదాలు తెలిపారు. దీంతో పాటు తాజాగా ప్రకటించిన కార్పోరేషన్ ఛైర్మన్లలో రాజేంద్రనగర్ నియోజకవర్గంకు చెందిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్‌గా నియమించడం మరింత సంతోషకరమని అన్నారు. ముదిరాజ్‌ల కల అయిన బిసి డి నుంచి బిసి ఎకు మార్పుపై సైతం త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

## సుభిక్ష అగ్రి ఫౌండేషన్

## రైతు మహిళా చైతన్య సదస్సు



**మక్తల్,మార్చి 17 ప్రభాతవార్త :** జిల్లా మహిళా రైతులతో సుభిక్ష అగ్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి ప్రేమికుడు డా.జయచంద్రమోహన్ వ్యవసాయ క్షేత్రంలో మూడో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. పలు సేంద్రీ పద్ధతుల గురించి డా. చంద్రమోహన్ అనేక విషయాలు మహిళా రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మహిళలు వ్యవసాయ మెళకువలు సేంద్రీయ వ్యవసాయ పరంగా అభివృద్ధి చెందేందుకు పర్యావసానాలను సవివరంగా వివరించడం జరిగింది. కార్యక్రమంలో సుభిక్ష రాష్ట్ర టీం సభ్యులు ఉమేష్, అలాగే రాబిన్‌హుడ్ ఆర్మీ (ఆర్‌హెచ్‌ఎ) సంస్థ సభ్యులు కిరణ్‌రమేష్, సుభిక్ష అగ్రి ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ శ్యాం, వాలంటరీ హనుమంతు, రేణువట్ల శంకరన్న కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యార్థి అదృశ్యం



**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 17, ప్రభాతవార్త:** మహబూ బ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన తమ కుమారుడు ధన్వంత్ కనబడుటలేదని కుటుంబ సభ్యులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ధన్వంత్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్ర లోని శ్రీచైతన్య పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. అయితే ఆదివారం ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయటికు వచ్చాండని అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఇంట్లో తల్లితండ్రులు కొంత మందలివ్వ డంతో ధన్వత్ బయటకు వచ్చినట్లు తెలిపారు. విచారణ చేపట్టిన పోలీసులు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లోని సీసీ ఫుటేజిలో రికార్ట్ అయినట్లు గుర్తించారు. అనంతరం ఎక్కడికి వెళ్లాడో విద్యార్థి ఆచూకీ తెలియలేదని పోలీసులు తెలిపారు.

